# నిజాయితీ ఎత్తు

## ఓ.వి.వి. సత్యనారాయణమూర్తి



"ఒకటీ, రెండూ... ఇరవై... ముప్పై... ఏభై... వంద"

"ఒకటీ, రెండూ... ఇరవైఅయిదు... ఏభై... డెబ్భైఅయిదు... వంద."

కృష్ణారావు డబ్బు లెక్కెస్తున్నాడు. ఇప్పటికి పదిసార్లయినా లెక్కపెట్టి వుంటాడు. అయినా డబ్బు లెక్కకు సరిపోవడం లేదు. నూటొక్క వంద కాగితాలు వుండాలి. కానీ లెక్కకు నూరు మాత్రమే వస్తున్నాయి.

మళ్ళీ ఇంకోసారి లెక్కపెట్టాడు. అంతే. నూరు కాగితాలే వున్నాయి. ఒక వంద కాగితం తక్కువ వస్తోంది.

కృష్ణారావుకు కంగారెక్కువయింది. ముఖం నిండా చెమట బిందువులు అలుముకున్నాయి.'ఇప్పుడు తక్కువయిన వంద రూపాయిలూ తనే కట్టుకోవాలి. ఈ విషయంలో యజమాని కర్కోటకుడు!

'తనకొచ్చే మూడువందల రూపాయిల జీతంలో వంద రూపాయిలు ఇలా పోతే... ఇంటి పరిస్థితి ఎట్లా? మూడువందల రూపాయిలలో ఎలాగో కష్టపడి సంసారాన్ని నెట్టుకొస్తున్నాడు. అందులో వంద రూపాయిలు తగ్గిపోతే... లోటు బడ్జెట్ అయిపోతే... నెలంతా గడిచేది ఎలా? ఎలా??'

కృష్ణారావుకు ఏమీ తోచడం లేదు. గుండెదడ ఎక్కువయింది. చొక్కా చెమటతో తడిసిపోయింది. కానీ ఏం చేస్తాడు?

యజమానికి జరిగిన సంఘటన, పరిస్థితి చెప్పుకున్నాడు. అతనేమీ మాట్లాడలేదు. తన పుస్తకంలో కృష్ణారావుకిచ్చే జీతంలో వంద రూపాయిలు కోత అని వ్రాసుకున్నాడు.

కృష్ణారావుకు కళ్ళవెంబడి నీళ్ళు కారాయి. అలాగే దిగాలు ముఖంతో ఇంటికి పోయాడు.

"ఏమైందండీ, అలా వున్నారు?" భార్య మంచి నీళ్ళు ఇస్తూ పలకరించింది.

కృష్ణారావు మాట్లాడలేదు. నెలలో చివరి రోజులు కళ్ళముందు మెదుల్తున్నాయి. తనూ, తన పెళ్ళాం పస్తులు వుండడం కళ్ళముందు కనిపిస్తోంది. కొత్తగా పెళ్ళి అయి కాపురానికి వచ్చిన పెళ్ళానికి నెలాఖరులో పస్తులుండాలని చెప్పుకోలేకపోతున్నాడు.

"ఏమైందండీ? చెప్పండి!" ప్రక్కనే కూర్చుంటూ మళ్ళీ అడిగింది అతని భార్య సుమ.

కృష్ణారావు నుండి మౌనమే సమాధానం అయ్యింది సుమకు. నెలాఖరులో పస్తులున్నట్లూ, తమిద్దరి ముఖాలూ పీక్కు పోయినట్లూ దృశ్యాలు కృష్ణారావు కళ్ళముందు ప్రత్యక్షమవుతున్నాయి. చివరకు సుమ లేచి లోపలకు వెళ్ళి, కూరల సంచీ తెచ్చి భర్త చేతిలో

పెట్టబోయింది.

"సుమా! ఈ రోజు నుండి ఇంట్లో కూరలు బంద్! పచ్చడి మెతుకులే గతి" నూతిలో నుండి వచ్చినట్లుగా వెలువడ్డాయి మాటలు.

"ఏమైందండీ!" మళ్ళీ అడిగిన భార్య ప్రశ్నకు సమాధానంగా జరిగిన సంగతి చెప్పక తప్పలేదు కృష్ణారావుకు.

"అయ్యో! అలాగయితే ఎలా అండీ? రెండు రోజులు పోయిన తరువాత మనం మానేద్దాం. ఈరోజు మీ అమ్మా, నాన్నగారు వస్తున్నారు. ఆ సంగతి మీరు మర్చిపోయినట్లున్నారు" అంటూ సంచీ చేతిలో పెట్టింది. కూరల కోసం మార్కెట్‌కు వెళ్ళడం తప్పలేదు కృష్ణారావుకు.

మండిపోతున్న ధరలను తిట్టుకుంటూ, కూరలు కొని ఇంటిముఖం పట్టాడు. ఇంతలో "కృష్ణారావుగారూ" అన్న కేక వినిపించి, వెనక్కు తిరిగి చూశాడు ఎవరా అని. దూరంగా వున్న కూరల దుకాణం నుంచి ఆ కేక. తమ కూరలు సామాన్యంగా అతని దగ్గరే కొంటూ వుంటాడు. నెమ్మదిగా నడుచుకుంటూ అతని దగ్గరికి వెళ్ళాడు.

"ఏం సార్! ఈరోజు నా దగ్గరికి రాలేదు" ఆప్యాయంగా పలకరింపు.

"ఏం లేదయ్యా! వెంటనే వెళ్ళిపోదామని దగ్గర దుకాణంలోనే కొనేశాను."

"పరవాలేదు లెండి! అసలు మిమ్మల్ని పిలిచిన కారణం వేరు. మధ్యాహ్నం మీ దుకాణం దగ్గరకు వచ్చాను. మీకు గుర్తుందో! లేదో! మీ షావుకారు గారికి కట్టవలసిన డబ్బు ఇచ్చాను. మీరు వంద రూపాయలు తక్కువ తీసుకున్నారు. ఇక్కడికి వచ్చిన తరువాత చూసుకున్నాను. రేపు వచ్చి కడదామనుకుంటుంటే, ఇంతలో మీరే కనబడ్డారు. ఇదిగో! ఈ వంద రూపాయలు తీసుకోండి" అంటూ నోట్లు ఇచ్చాడు కూరలబ్బి.

కృష్ణారావు నిశ్చేష్టుడయ్యాడు. వెంటనే తనకు తనే సిగ్గుపడ్డాడు.

'...తను మార్కెట్‌కు వచ్చినప్పుడల్లా అతను హడావుడిలో వుండగా కక్కుర్తిగా ఒకటికి రెండు కూరలు ఎక్కువ వేసుకోవడం, ఎప్పుడైనా అతను పొరపాటున చిల్లర ఎక్కువ ఇచ్చినా తిరిగి ఇవ్వకపోవడం గుర్తుకు వచ్చాయి. ఆ కూరలవాడి ముందు తనెంత? ఎంత బీదతనంలో కూడా నిజాయితీని వదలని మనిషి! అతని ఎత్తు అయిదు అడుగులయినా, అతడి నిజాయితీ మహోన్నత శిఖరాల నంటింది. తను ఆరడుగుల పొడవున్నా, తన నిజాయితీ ఎక్కడో అగాధంలో వుంది!' ●

## కేన్సరు రోగులకు ఊరట

కేన్సరు రోగుల బాధను తగ్గించే శస్త్ర చికిత్సను ఒకదానిని పశ్చిమ జర్మనీ శాస్త్రవేత్తలు రూపొందించారు. ఆహార నాళం, గాలిగొట్టాలు మొదలగు వాటిలో కేన్సరు కురుపు ఏర్పడినవారికి ఇది ఉపయోగించగలదు. ఈ కేన్సరు వలన రోగులు గాలిని స్వేచ్ఛగా పీల్చలేరు. ఆహారాన్నికూడా తీసుకోలేరు. ఈ పద్ధతిలో లేసర్ కాంతి రేడియో ధార్మిక కిరణాలతో ఈ కేన్సరు కురుపుకు రంధ్రం చేస్తారు. అందువలన రోగుల బాధ కొంత ఉపశమిస్తుంది. ఇది కేన్సరుచికిత్స కాకపోవచ్చు. కానీ ఆహారం సరిగా తీసుకోవడం వలన రోగి పరిస్థితి మెరుగవుతుంది. ఆపరేషన్ చేయడానికి వీలుకాని రోగులకు క్రమేణా ఆపరేషన్‌చేసి కేన్సరును తొలగించడానికి అవకాశం ఏర్పడగలదు. (గ్లోబల్)


వనితా జ్యోతి

సచిత్ర మాసపత్రిక

### కళాశాల విద్యార్థినులకు మినీ కథల పోటీ

కళాశాల విద్యార్థినులలోని ప్రతిభను, సృజనాత్మక శక్తిని, రచనా పాటవాన్ని వెలుగులోకి తెచ్చే నిమిత్తం వారికోసం 'వనితాజ్యోతి' ప్రతినెలా మినీ కథల పోటీ నిర్వహిస్తోంది.

ఈ పోటీలో కాలేజీలో చదువుతున్న లేదా ప్రైవేట్‌గా చదువుతున్న విద్యార్థినులెవరైనా పాల్గొనవచ్చు.

మినీ కథలు రెండు లేదా మూడు అరఠావులకు మించకుండా. (సుమారు 400 పదాలకు మించకుండా) పేజికి ఒకే వైపున వ్రాసి పంపాలి.

రచనలు ప్రతినెలా 25వ తేదీలోగా అందేలా పంపాలి.

ఆ నెలలో మాకు అందిన మినీ కథల్లో ఉత్తమమైన వాటిని ప్రచురిస్తాము. ప్రచురించిన ప్రతి మినీ కథకు రు. 50/- బహుమానంగా అందజేస్తాము.

### కళాశాల విద్యార్థినులకు మరి కొన్ని శీర్షికలు

#### ఒక సారి ఏం జరిగిందంటే

ఏదైనా ఆశ్చర్యంగాని, ఆనందంగాని, విచిత్రంగాని అనిపించే సంఘటన ఎదురైందా? అయితే దానికి అక్షరరూపం ఇచ్చి అరఠావుకు మించకుండా పేజీకి ఒక వైపున వ్రాసి పంపండి.

ఎన్నిక చేసి ప్రచురించిన ప్రతి రచనకూ రు. 30/- పారితోషికంగా అందజేస్తాము.

#### ఒక మంచి జోక్ వ్రాయండి

నిత్య జీవితంలో మనకు ఎదురైన సంఘటనలు కొన్ని నవ్వుపుట్టించేవిగా ఉంటాయి. అలాంటి అనుభవాల్ని పాఠకులతో కలిసి పంచుకోండి.

మీ జోక్స్‌ను పది లైన్లకు మించకుండా కాగితానికి ఒక వైపున వ్రాసి పంపండి. ఒకరు ఎన్ని జోకులైనా పంపవచ్చు.

ఎన్నికయిన ప్రతి జోకుకు రు. 20/- పారితోషికం ఉంటుంది.

మీ రచన వెనుకవైపు మీ పూర్తి పేరు, కాలేజీపేరు, చదువు, చిరునామా వివరంగా వ్రాసి, హామీ పత్రం జతపరిచి పంపండి.

'మినీకథ', 'ఒక సారి ఏం జరిగిందంటే', 'జోక్'—ఏది వ్రాసినా కవరుపై ఆ శీర్షిక పేరు వ్రాసి

ఎడిటర్, వనితాజ్యోతి, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, పి.బి.నెం 712 విజయవాడ-520 010 చిరునామాకు పంపండి. —ఎడిటర్